# కామేశం కథ

టి.పి.హేమమాలిని

అర్ధరాత్రి పన్నెండు గంటల వేళ . పురుటినొప్పులు మొదలైన వెంకటలక్ష్మిని హాస్పిటల్‌కి తీసుకొచ్చారు. ఆమె కండిషన్ చూసిన డాక్టర్ అప్పటికే లేబర్ రూమ్‌లో ఉన్న మరో స్త్రీని ఇవతలికి పంపించేసి, ఆ టేబుల్ మీద వెంకటలక్ష్మిని ఎక్కించేసింది.

మరో ఐదు నిమిషాలకే పండంటి మగబిడ్డ పుట్టాడు. వెంకటలక్ష్మికి అది రెండో కాన్పు. ముందు ఆడపిల్ల. పుట్టగానే ఆపకుండా ఏడుస్తున్న పిల్లాడిని తల్లి పక్కలో పడుకోబెట్టింది నర్సు. అయినా సరే ఏడుపాపలేదు. ఏం చేసినా ఊరుకోలేదు. ఆఖరికి నర్సు పక్క ఉయ్యాలలో ఉన్న పిల్లవాడిని తీసి ఆ తల్లి పక్కన పడుకోబెట్టి, ఆ ఉయ్యాల్లో వెంకటలక్ష్మి కొడుకును పడుకోబెట్టింది.

మరో నిమిషానికే హాయిగా నిద్ర పోయాడు. పుట్టగానే తల్లి వెచ్చదనం కోసం ఏడ్చే పిల్లలను చూసింది కానీ, ఉయ్యాల సౌఖ్యం కోసం ఏడ్చి పడుకున్న బిడ్డను చూసి ఆశ్చర్యపోయింది.

వెంకటలక్ష్మి మర్నాడే ఇంటికొచ్చేసింది. పదకొండు రోజుల స్నానం నాడు బారసాల చేసుకున్నారు ఘనంగా.

తమ అన్నదమ్ములందరిలోకీ తనకే మగపిల్లాడు పుట్టినందున తన తండ్రి పేరు పెట్టాలని పట్టుబట్టి మరీ నామకరణం చేసాడు వెంకటలక్ష్మి మొగుడు. 'కామేశం' పాతపేరైనా భర్త మాటకు ఎదురు చెప్పలేక ఊరుకుంది వెంకటలక్ష్మి.

అందరూ ఎన్నెన్నో కానుకలు తెచ్చారు పసివాడికి. వెంకటలక్ష్మి తండ్రి మనవడిని ఎత్తుకున్నాడు. పొత్తిళ్ళల్లో ఉన్న కామేశం తాత మెడలోని గొలుసును పట్టుకుని లాగసాగాడు.

"నువ్వు పట్టుకోవలసింది తాతయ్య మీసాలురా భడవా!" మురిపెంగా అన్నాడు తాత.

వెంకటలక్ష్మి వచ్చి ఎంత విడిపించినా వదలలేదు. ఆ చిన్న పిడికిలిలో అంత బలం ఎలా వచ్చిందో అర్థంకాలేదెవరికీ.

చివరాఖరికి తాత గొలుసుకున్న కొక్కెం తప్పించి తప్పుకున్నాడు. తర్వాత కూడా ఆ గొలుసును గుప్పిట్లోంచి వదలలేదు.

తాత ఇచ్చిన బారసాల బహుమతులతో పాటు ఆ గొలుసుకూడా కామేశం స్వంతమైపోయింది.

రోజులు గడుస్తున్నాయి. కామేశానికి అన్నప్రాశన చేయించడానికి సింహాద్రప్పన్న కొండకెళ్ళారు. అక్కడ వీళ్ళలాగే మరో జంట కూడా తమ పిల్లాడికి అన్నప్రాశన చేస్తున్నారు. కామేశం ముందు పసుపు, కుంకుమ, పెన్ను, పుస్తకం, డబ్బు అన్నీ పెట్టారు. కామేశం పాక్కుంటూ వెళ్ళి పక్కవాళ్ళు పెట్టిన వెండి పెన్ను తీసాడు. వాళ్ళ అబ్బాయి ఏమీ ముట్టుకోకుండా ఏడ్చి గోల పెడుతుంటే, కామేశం దూకుడికి వాళ్ళు ఆశ్చర్యపోయి ఆ వెండి పెన్ను బహుమతిగా ఇచ్చేసారు.

మరో రెండేళ్ళకి అక్షరాభ్యాసం నాడు తన కోసం కొన్న పలక, బలపం కన్నా, అక్కకి కొన్న పుస్తకాల బ్యాగు కామేశానికి నచ్చింది. అదే కావాలని మారాం చేసి మరీ సాధించాడు. కామేశం అక్కకి వేరేది కొనాల్సి వచ్చింది.

ఇలాగే కామేశం ప్రవర్తన వయసుతోపాటు పెరుగుతూ వచ్చింది. తనకీ, అక్కకీ ఒకేలాంటి వస్తువులు కొన్నా అదేమిటో అక్కకి కొన్నదే కామేశానికి నచ్చేది. తమ్ముడు చిన్నవాడు కదాని ఆ అమ్మాయిని ఒప్పించి అది కామేశానికి ఇప్పించేసేవారు.

ooo

వెంకటలక్ష్మి భర్త లోను తీసుకుని ఇల్లు కట్టాడు. ప్లాన్డ్‌గా అందంగా కట్టుకున్నాడు. సెపరేట్ బెడ్‌రూమ్స్, డైనింగ్‌రూమ్, సిటౌట్ అన్నీ పద్ధతిగా కుదిరాయి. గృహప్రవేశం చేసుకున్నారు.

ఆరోజు రాత్రి అందరూ భోం చేస్తున్నారు.

"అమ్మా! నేనీ మూల కుర్చీలో కూచుంటే అన్నం తింటున్నా ఎంచక్కా నాకు టి.వి. కనిపిస్తోందే!" వెంకటలక్ష్మి కూతురు ఆనందంగా అరిచింది. ఆ మాట కామేశం చెవిన పడింది.

"వీల్లేదు నాకా ప్లేస్ కావాలి" అన్నాడు.

"ముందు అక్క కూచుంది కదా! రేపు నువ్వు కూచుందు గానిలే!" అంది అనునయంగా వెంకటలక్ష్మి.

"అబ్బా! అలా కాదు. రోజూ నాకే కావాలి. ఇప్పుడే కావాలి" అంటూ ఏడవసాగాడు. బుజ్జగించబోయింది తల్లి. అయినా వినలేదు. అన్నం తిననంటూ మొరాయించాడు. తల్లి మనసు కరిగిపోయింది. కూతురికి నచ్చచెప్పి కొడుక్కి ఆ జాగా ఇప్పించింది.

ఈ విధంగా కామేశానికి తన దగ్గర ఉన్న వస్తువులకంటే పక్కవారి వస్తువుల మీద మక్కువ ఎక్కువగా ఉండేది.

ఈ వైఖరికి వెంకటలక్ష్మి దిగులు పడేది. కానీ వెంకటలక్ష్మి భర్త మాత్రం ఇది భవిష్యత్ రాజకీయ నాయకుడి లక్షణాలంటూ పొంగిపోయేవాడు.


ooo

స్కూలు చదువు పూర్తయి కాలేజీ మెట్లు ఎక్కాడు కామేశం. అది కో-ఎడ్యుకేషన్ కాలేజ్. అబ్బాయిల స్కూల్లో చదివిన కామేశానికి అమ్మాయిలందరూ రంగు రంగుల సీతాకోక చిలుకల్లా అనిపించారు. అతని అదృష్టం కొద్దీ అతని బెంచీ పక్కనే అమ్మాయిల బెంచీ. కాకపోతే ముందుగా వేరే అబ్బాయి కూచున్నాడు. అతన్ని దబాయించి మరీ ఆ స్థానాన్ని ఆక్రమించాడు.

పాఠాలు వినడంకంటే అమ్మాయిల మాటలు వినడానికే ప్రాధాన్యత ఇచ్చేవాడు. అందుకే వైరైటీగా ఇంటర్ నాలుగేళ్ళు, డిగ్రీ ఐదేళ్ళు చదివాడు.

అదే కాలేజ్‌లో లెక్చరర్ల కంటే సీనియారిటీని

సంపాదించేసాడు. ఎలాగోలా డిగ్రీ చేతికొచ్చింది. ఉద్యోగ ప్రయత్నాలు మొదలెట్టాడు. టీచరుద్యోగానికి సెలవులు ఎక్కువ ఉంటాయి కాబట్టి ఆ ఉద్యోగం చేసెయ్యమంది వెంకటలక్ష్మి. తన కొడుక్కి ఎవరో పిలిచి పనిస్తున్నట్లు. అదే అభిప్రాయంతో నేనా ఉద్యోగం చెయ్యను పొమ్మన్నాడు కామేశం. బి.ఇడిలో సీటుకి ఎంత కాంపిటేషన్ ఉంటుందో తెలుసతనికి. అందుకే ఆ జోలికెళ్ళ లేదు.



ఎక్కడా చిన్నపాటి ఉద్యోగం కూడా దొరక లేదు, చదువులో అతనికి 'అనుభవానికి'.


ఒకరోజు ఇంటి ముందు పచార్లు చేస్తున్నాడు కామేశం. అతని ఇంటి పక్కనే ఒక జాగా ఉంది. అది ఎవరిదో, వారెక్కడున్నారో కూడా తెలియదు.

సరిగ్గా అప్పుడే ఎవరో ఒక పెద్దమనిషి మరో వ్యక్తితో కలిసి సరాసరి ఆ జాగా దగ్గర ఆగాడు. ఇద్దరూ ఏదో చర్చించుకున్నారు. మరో గడియ తర్వాత కామేశం దగ్గర కొచ్చారు.

"బాబూ! ఈ జాగా ఎవరిది? ఎవరికైనా అమ్మే ఉద్దేశం ఉందా? లేదా వాళ్ళే కట్టుకుంటారా? నీకేమైనా తెలుసా?" వరుసగా క్విజ్ ప్రోగ్రామ్ పెట్టేసాడు ఆ పెద్దమనిషి.

అదే సమయంలో కామేశం మెదడులో తిరుగుతున్న ఆలోచనలు ఎక్కడో కలిసాయి. తటిల్లతలా ఏదో ఆలోచన మెరిసింది.

"ఈ స్థలం మాదేనండీ. ఇదిగో..ఇదే మా స్వంత ఇల్లు. ఈ స్థలం అమ్మేయాలనే అనుకుంటున్నాం. ఇంతకీ ఎవరికి?" అడిగాడు కామేశం.




"నాకే బాబూ! ఈ జాగాలో ఈస్ట్‌ఫేసింగ్ వచ్చేట్లు ఇల్లు కట్టుకోవచ్చు. నాకు ఆ విధంగా ఉంటే మంచిదన్నారు. అందుకే వివరాలు కనుక్కుందామని వచ్చాను" అన్నాడు ఆ పెద్ద మనిషి.

"మీరు రేపు వస్తే మా నాన్నగారు అన్ని వివరాలూ చెప్తారు" అన్నాడు కామేశం. మరునాడు వస్తామంటూ వారు వెళ్ళిపోయారు.

కామేశం తండ్రి ఆఫీసు నుంచి వచ్చాక తన ఆలోచనను వివరించాడు. విన్న అతను నివ్వెరపోయాడు. అలాంటి పనులు అచ్చిరావన్నాడు. కామేశం నచ్చచెప్పాడు. అప్పుడు తండ్రి అందులో లోటుపాట్లు ఆలోచించాడు. ఏమైనా ప్రాబ్లమ్స్ వస్తాయేమోనన్న సందేహం వెలిబుచ్చాడు.

కానీ కామేశం ఇవాళ రేపు ఇలాంటి సర్వసాధారణం అన్నాడు. మొత్తానికి తండ్రిని ఒప్పించాడు. ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి. అనుకున్నట్లుగానే ఆ స్థలాన్ని ఆక్రమించాడు. కొత్తపత్రాలు సృష్టించాడు లంచంతో. ఆ స్థలాన్ని వచ్చిన పార్టీకి అమ్మేసాడు.

ఈ వ్యవహారం వల్ల అతనికి పెట్టుబడి లేని లాభం వచ్చింది. దీనివలన కామేశం ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాడు, ఇక జన్మలో ఉద్యోగం కోసం ప్రయత్నించకూడదని.




వచ్చిన లాభంతో ఒక ఆఫీసు పెట్టాడు. హంగు, ఆర్భాటంతో రియల్ ఎస్టేట్ బిజినెస్ మొదలెట్టాడు.

అవకాశమున్న చోటల్లా కబ్జా చేసేయడమే. తక్కువ ధరకు కొని ఎక్కువ లాభానికి అమ్మడం అన్నది అతని డైరీలోనే లేదు. అన్నీ మదుపు లేని లాభాలే.

చూస్తూండగానే కామేశం ధనవంతుడైపోయాడు. ఇతన్ని చూసిన స్నేహితులందరూ ఆశ్చర్యపోయారు. చదువబ్బని కామేశాన్ని సిరి ఎలా వరించిందోనని. అత్తాకోడళ్ళిద్దరూ ఒకచోట ఉండరని మరోసారి ఋజువైంది.

సంఘంలో కబ్జాల కామేశం అన్న పేరు వచ్చేసింది. ఫలానావారి అబ్బాయంటే ఎవరికీ తెలియదు. రాజకీయ పార్టీల అండదండలు సంపాదించి, తనకో స్థానాన్ని ఏర్పరచుకున్నాడు.

○○○

ఒకానొక సందర్భంలో కామేశం మనసులోనూ ప్రేమ చిగురించింది.

సుందరిని చూసిన దగ్గర నుంచి అతని మనసు ఆమె ఆధీనంలోకి వెళ్ళిపోయింది. "ఎటో వెళ్ళిపోయింది మనసు, సుందరి దగ్గర ఉందని తెలుసూ.." అంటూ రాగాలు తీయసాగాడు.

అయితే కామేశానికి సమస్య వేరేది వచ్చిపడింది. ధనిక వర్గాల జాబితాలో చేరిపోయిన కామేశం కుటుంబానికి సన్నిహితులైన రామారావు దంపతుల కూతురు డింకీ కామేశాన్ని వలచింది. క్లుప్తంగా చెప్పాలంటే ట్రాయాంగ్యులర్ లవ్‌స్టోరీ.

కొండంత ఆస్తి ఉన్నా చెప్పుకోదగ్గ రూపురేఖలు లేవు డింకీకి.

ఆస్తి ఎలాగూ తనకు ఉంది కదా అని అతని దృష్టి సుందరి మీదే ఉంది.

తన ప్రేమను ఎలా వెల్లడించాలో అర్థం కాలేదతనికి. రిహార్సల్స్ వేసుకుని ఒకానొక మంచి ముహూర్తంలో సుందరికి తన మనసులో మాట చెప్పేసాడు. సుందరి అవును, కాదు అనలేదు. ఆలోచించి చెప్తానంది. అదే గ్రీన్ సిగ్నల్ అనుకున్నాడు. ఇంతలో మరో సంగతి తెలిసింది. కామేశం స్నేహితుడు డింకీని ప్రేమిస్తున్నాడని. పోన్లే! డింకీ బాధ తప్పిందని సంతోషించాడు.

కానీ రాను రాను కామేశానికి కన్ను కుట్టసాగింది. డింకీ అంతటి కోటీశ్వరురాలు ఒక అష్టరాల్‌గాడిని ప్రేమించి, పెళ్ళాడడమా? డింకీ వాడిని పెళ్ళి చేసుకుంటే వాడు తన కన్నా ఆస్తిపరుడు అయిపోతాడు. ఏ శ్రమా లేకుండా లంకంత భవనానికీ, కొండంత సంపదకీ ఏకైక వారసుడైపోతాడు.

అదీకాక డింకీ తననే ప్రేమించింది. తను కాదనడంతో డిప్రెషన్‌లో వాడిని ఓ.కే. చేసుంటుంది.

వాడు, డింకీ రాసుకు పూసుకు తిరగడం, కామేశానికి కారం రాసుకున్నట్లుంది వాళ్ళయవ్వారం.

వీల్లేదు! అలా జరగడానికి వీల్లేదు. తన సర్కిల్‌లో అందరికంటే తనే ధనవంతుడు కావాలి. సుందరి అందాన్ని కొరుక్కు తింటాడా? తనదీ, డింకీదీ కలిస్తే లెక్కపెట్టలేనంత ఆస్తి అవుతుంది.



ఒక నిర్ణయాని కొచ్చిన కామేశం డింకీని కలిసాడు. తన మనసులోని మాట చెప్పాడు. ఆశ్చర్యపోయిన డింకీ ఎగిరి గంతేసింది. టైమ్‌పాస్ కోసం అతని స్నేహితుడితో తిరుగుతున్నట్లు, తన మనసులోనిది నిజంగా ప్రేమ కాదనీ చెప్పింది.


రంగరంగ వైభవంగా వారి పెళ్ళి జరిగిపోయింది. కామేశానికి తనకు దక్కిన ఆస్తి కన్నా, స్నేహితుడి స్థితి మామూలుగానే ఉండిపోతుందనే భావనే ఎక్కువ కిక్కిచ్చింది.


కామేశం, డింకీ హనీమూన్ వెళ్ళిపోయారు.

పదిరోజుల తర్వాత తిరిగి వచ్చిన కామేశానికి అనుకోని షాక్

## నాలుగేళ్ల తర్వాతే!

మరో నాలుగేళ్ల తర్వాతే పెళ్లి చేసుకుంటానని చెబుతోంది బిపాషా బసు. తనకి 32 సంవత్సరాల వయసు వచ్చే వరకూ పెళ్లిచేసుకోకూడదని అనుకుంటున్నట్టు, అప్పుడే పెళ్లాడాలని నిర్ణయించుకుంటున్నట్టు చెబుతున్న బిపాషా ప్రస్తుత వయసు 28 ఏళ్లు. అంటే మరో నాలుగేళ్లు గడిచాక పెళ్లికూతురవుతాదన్నమాట. అయితే ఆమె బాయ్‌ఫ్రెండ్ జాన్ అబ్రహాం ఆమెని పెళ్లాడాలంటే ఇంకో నాలుగేళ్లు ఆగాల్సిందే! మరి జాన్ ఆలోచనేంటో?




తగిలింది.

తన స్నేహితుడు, సుందరి పెళ్ళి చేసుకోబోతున్నారు.

కామేశానికి చేష్టలు దక్కాయి. సునామీ ముంచెత్తినట్లు అనిపించింది.

ఇంతలో కామేశం స్నేహితుడు వచ్చాడు. వెడ్డింగ్ కార్డ్ అందిస్తూ చెప్పాడు.

"కామేశం! నీ మనస్తత్వం నాకు బాగా తెలుసు. నీకు నీ దగ్గర ఉన్న వస్తువు కన్నా పక్కవాడి వస్తువే ఆకర్షిస్తుంది. ఆ లక్షణం వల్లే నువ్వు ఇంత పెద్దవాడివయ్యావు. సంపన్నుల జాబితాలో చేరిపోయావు.

నేను, సుందరి ప్రేమించుకున్నాం. నాకు ఉద్యోగం వచ్చాక పెద్దలకు చెప్పాలనుకుని రహస్యంగా ఉంచాం.

కానీ నీ మనసు సుందరి అందాన్ని చూసింది. సుందరి నాకు చెప్పింది. నేనాలోచించాను. డింకీ మేటర్ తెలుసు నాకు. అందుకే డింకీ సాయమడిగాను.

డింకీ నిజంగా నిన్ను ప్రేమించింది. ఎలాగైనా నిన్నే పొందాలనుకుంది భర్తగా. అందుకే నా ఆలోచనని అంగీకరించింది.

డింకీ నన్ను ప్రేమిస్తున్నట్లు నటిస్తే, సహజంగానే నా ప్రేయసి మీద నీకు ఆసక్తి కలుగుతుంది. ఎందుకంటే పక్కవాడి వస్తువులంటే ఇష్టం కదా నీకు!

నా అంచనా తప్పలేదు. అభిప్రాయం తప్పుకాలేదు. వ్యూహం ఫలించింది.

డింకీ అంతటి ఆస్తిపరురాలు నన్ను ప్రేమించిందన్న విషయాన్ని నువ్వు తట్టుకోలేకపోయావు.

నువ్వు ఇష్టపడిన అమ్మాయికంటే, నేనిష్టపడిన అమ్మాయి గురించే నువ్వెక్కువగా ఆలోచించావు. రెండు ఆస్తులు కలిస్తే ఎంత అవుతుందో లెక్కలు వేసావు. ఫలితమే డింకీతో నీ పెళ్ళి. సుందరికీ నాకూ వివాహబంధం.

ఏదేమైనా సుందరి లాంటి అందగత్తె, సుగుణాలరాశి నాకు లభించడం నా పుణ్యమే! థాంక్యూ! పెళ్ళికి రావడం మర్చిపోకు. అన్నట్లు మన కాలేజ్‌లోనే నాకు లెక్చరర్‌గా పోస్టింగ్ వచ్చింది. నా సుందరిని ప్రేమగా చూసుకోవడానికి అది చాలు. వస్తాను"

తను చెప్పదలచుకున్నదంతా చెప్పేసి వెళ్ళిపోయాడు కామేశం స్నేహితుడు.

కామేశం మనసుని అశాంతి కబ్జా చేసేసింది.

○

## సమీరా-షకీరా-భాంగ్రా!

నిన్నటి దీపావళికి విదేశాల్లో వున్న సమీరా రెడ్డి కొన్ని ఫంక్షన్స్‌లో పాల్గొందిట. ఆ సందర్భంగా పాప్ స్టార్ షకీరాని కూడా కలిసిందిట. అప్పుడామె మన పంజాబీ భాంగ్రా డాన్స్‌ని ప్రదర్శించినప్పుడు షకీరా తెగ ఇదైపోయి తనకి కాస్త నేర్పమని కోరిందిట. అంతే సమీరా మేడమ్ నో అనకుండా వెంటనే నాలుగు భాంగ్రా స్టెప్పులు నేర్పించేసిందిట. ఎప్పుడైనా మన దేశం వచ్చినప్పుడు షకీరా నుంచి మనం భాంగ్రా డాన్స్ ఎక్స్‌పెక్ట్ చేయవచ్చు. అలానే ఆమె కొత్త ఆల్బమ్‌లలో కూడా వుంటుందేమో చూడాలి!

